క్లుప్తంగా

హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ



ట్రోఫీ అందుకుంటున్న హ్యాండ్‌బాల్ బాలుర జట్టు

మదనపల్లె సిటీ : రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ అండర్–17 బాలుర విభాగంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు ప్రతిభ చాటిందని జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి వసంత తెలిపారు. ఈనెల 7వ తేదీ నుంచి 9వతేదీ వరకు జరిగిన రాష్ట్ర అండర్–17 హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో మొదటి స్థానం దక్కించుకున్నారు. మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన జ్యోతి ప్రకాష్, ఖుషి పోటీల్లో పాల్గొన్నారన్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆంజనేయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వెంకటేష్, పీడీలు నాగరాజ, నరేష్‌బాబు తదితరులు అభినందించారు.

బైక్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు



గాయపడిన కృష్ణయ్య

బి.కొత్తకోట : సత్యసాయి జిల్లా కదిరి నుంచి మదనపల్లెకు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని మరో బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని జాతీయరహదారి పెద్దపల్లె వద్ద జరిగింది. స్థానికుల కథనం మేరకు. కదిరికి చెందిన కృష్ణయ్య (56) పెళ్లి సంబంధాలు చూసేందుకు మదనపల్లెకు వెళ్తున్నాడు. బైక్‌పై వెళ్తున్న ఆయన్ను ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని బైక్ ఢీకొంది. దీనితో తీవ్రంగా గాయపడిన కృష్ణయ్యను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం తిరుపతి తరలించారు.

డీటీకి తహసీల్దార్ బాధ్యత

బి.కొత్తకోట : బి.కొత్తకోట డిప్యూటీ తహసీల్దార్ అహమ్మద్ అన్సారీ బుధవారం తహసీల్దార్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ శ్రీధర్‌రావు 37 రోజులకే ఓబులవారిపల్లె మండలానికి బదిలీ అయ్యారు. కొత్తగా నరేంద్ర కుమార్‌ను బదిలీ చేయగా ఆయన ఇప్పటిదాక బాధ్యతలను స్వీకరించలేదు. దీనితో కలెక్టర్ డీటీకి బాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి



పులి రాజేశ్వరమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం : మండలంలోని కూరపర్తికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పులి రవీంద్రారెడ్డి సతీమణి పులి రాజేశ్వరమ్మ మృతి చెందింది. బుధవారం ఆమె దశదినకర్మ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తన స్వగృహానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ కోసం పులి రవీంద్రారెడ్డి కుటుంబం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనందరెడ్డి, పులి శివకుమార్ రెడ్డి, మదన్‌మోహన్ రెడ్డి, ఉపసర్పంచ్ కేశవరెడ్డి తదిరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ క్రికెట్ జట్టుకు ఆదిత్య విద్యార్థి ఎంపిక



కాలేజీ డైరెక్టర్, అధ్యాపకులతో తేజవర్ధన్‌రెడ్డి

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థి తేజవర్ధన్‌రెడ్డి జేఎన్‌టీయూ సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. నెల్లూరు జిల్లా గూడూరులో జరిగిన సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ ఎంపిక పోటీల్లో పాల్గొన్నాడు. తేజవర్ధన్‌రెడ్డి ఈసీఈ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థిని కాలేజీ డైరెక్టర్ రామలింగారెడ్డి, ప్రెసిడెంట్ నాగమల్లారెడ్డి, చైర్మన్ రామమోహన్‌రెడ్డి,ప్రిన్సిపాల్ సతీష్, అధ్యాపకులు అభినందించారు.

పల్లెకు పండుగను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న పీఆర్ డీఈ మధుసూదన్

పీలేరు రూరల్ : మండలంలో ఈనెల 14వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించే పల్లెకు పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ డీఈ మధుసూదన్ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామసచివాలయ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో మండలానికి 24 సీసీ రోడ్లు పనులకు గానూ రూ. 85 లక్షలు మంజూరైందని, ఆయా పంచాయతీల్లో ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహిస్తామన్నారు. ఏఈ ఎం. రామకృష్ణనాయక్, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై ఆర్టీసీ చిన్నచూపు

- పర్యాటకులకు ప్రైవేటు వాహనాలే దిక్కు
- ఉదయం, సాయంత్రం ఒక బస్సు నడుస్తోంది
- సెలవుల్లోనూ అదనపు బస్సు నడవరు



ఆటోలో హార్సిలీహిల్స్‌కు వస్తున్న సందర్శకులు



దసరా సెలవులతో సందర్శకుల రద్దీ

బి.కొత్తకోట : పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ వెళ్లాలంటే సాధారణ పర్యాటకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొండపైకి వెళ్లేందుకు మదనపల్లె–1 డిపో నుంచి ఆర్టీసీ బస్సు నడుపుతున్నా అది పర్యాటకులకు ఏమాత్రం అందుబాటులో లేదు. వేళకాని వేళల్లో బస్సు నడుస్తున్న కారణంగా ఆర్టీసీకి ఆదాయం లేకపోగా సందర్శకులకు అనుకూలంగా లేకపోయింది. సందర్శకులు కొండకు రావాలంటే ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి జేబుకు చిల్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కనీసం సెలవులు, పండగల సమయాల్లోనూ అదనంగా ఒక బస్సునూ నడపడం లేదు. ప్రస్తుతం దసరా సెలవుల కారణంగా కొండపై రద్దీ నెలకొంది. దీన్ని దృష్టిలో పెట్టుకునైనా అదనంగా ఆర్టీసీ బస్సులు నడవడం లేదు. ఆర్టీసీకి ఆదాయం నష్టపోతుండగా, పర్యాటకులకు అసౌకర్యం కలుగుతోంది.

ఆ వేళలు ఇబ్బందికరం

హార్సిలీహిల్స్‌కు ప్రతిరోజూ ఆర్టీసీ బస్సు ఒకటి మాత్రమే నడుస్తోంది. మదనపల్లె ఆర్టీసీ బస్టాండ్ నుంచి తెల్లవారుజాము 6.30 గంటలకు బయలుదేరి 7.30గంటలకు కొండకు చేరుతుంది. తర్వాత సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరి 6.15గంటలకు కొండకు వస్తుంది. ఈ సమయాల్లో కొండకు రావాలంటే సందర్శకులకు వీలుపడదు. ఉదయమే ఈ సమయంలో బస్సులో వెళ్లేందుకు పర్యాటకులు సిద్ధం కాలేరు. తెల్లవారుజాము, సాయంత్రం మాత్రమే బస్సు నడుస్తుండగా ఈ మధ్యలో బస్సులేదు. దీనితో సందర్శకులు ఆర్టీసీ బస్సులో వెళ్లేందుకు వీలులేదు. ప్రతిరోజూ కొండపైనున్న విద్యార్థులను మదనపల్లెకు తీసుకెళ్లడం, సాయంత్రం వీరిని తీసుకురావడానికి మాత్రమే ఉపయోగపడుతోంది. సందర్శకులు రాకపోకలు సాగించేందుకు ఏమాత్రం వీలులేకుండాపోతోంది.

ప్రైవేట్ వాహనాలే దిక్కు

వివిధ ప్రాంతాల నుంచి బస్సుల్లో వచ్చే సాధారణ సందర్శకులు కాండ్లమడుగుక్రాస్ చేరుకుంటారు. ఇక్కడి నుంచి 9 కిలోమీటర్ల ఘాట్‌రోడ్డు ప్రయాణం ద్వారా కొండపైకి చేరుకోవాలి. అయితే ఉదయం, సాయంత్రం మాత్రమే బస్సు ఉండటంతో సందర్శకులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కొంతమంది పర్యాటకులు ముందుగా ఆటోలు, ఇతరా వాహనాల్లో కొండకు వస్తుంటారు. సాధారణ పర్యాటకులకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి అదనంగా బస్సును నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆ ఒక్కరోజే స్పెషల్

బస్సులో వచ్చే సందర్శకులు ఆదివారం ఒక్క రోజే ప్రయాణిస్తున్నారు. ఉదయం వేళలో మదనపల్లె నుంచి వచ్చేవారు, సాయంత్రం కొండ దిగేటప్పుడు సందర్శకులు బస్సులో ప్రయాణిస్తున్నారు. ఇది మినహాయిస్తే బస్సులో వచ్చివెళ్తున్న సందర్శకుల సంఖ్య తక్కువ. ఈ బస్సులో కాండ్లమడుగుక్రాస్, అంగళ్లు నుంచి మదనపల్లెకు రాకపోకలు సాగించే ప్రయాణికులకు మాత్రమే అనుకూలంగా ఉంది. ఈ విషయంలో ఆర్టీసీ అధికారులు స్పందించి మధ్యాహ్నం వేళలో మరో అదనపు సర్వీసును హార్సిలీహిల్స్‌కు నడిపితే సందర్శకులకు సౌకర్యంగా ఉంటుంది.

ప్రశాంతంగా దసరా ఉత్సవాలు నిర్వహించుకోవాలి

– సీఐ యుగంధర్



పీలేరు రూరల్ : మండలంలో దసరా ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సీఐ యుగంధర్ అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ డీజే సౌండ్ సిస్టమ్ నిషేధమన్నారు. ఎక్కడైనా సంబరాలు శృతిమించితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దసరా సెలవులో ఊర్లకు వెళుతున్న ప్రజలు పోలీసులకు సమాచారం ఇస్తే వారి ఇళ్ల వద్ద పోలీస్ గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. ఊరు శివారు ప్రాంతాల్లో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి తలుపు తడితే వెంటనే తలుపు తీయకూడదని, సమాచారం తెలుసుకుని ఫోటోలు తీసి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. రాత్రి వేళల్లో 9 గంటల పైన పట్టణ పుర వీధుల్లో ద్విచక్రవాహనాలతో చక్కర్లు కొట్టే ఆకతాయిల పని పడుతామని హెచ్చరించారు.

విష్ణువర్ధన్‌కు స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డు



విష్ణువర్ధన్

పీలేరు : పీలేరు పట్టణం బండ్లవీధికి చెందిన బి. విష్ణువర్ధన్ బాల్‌బ్యాడ్మింటన్ 'స్టార్ ఆఫ్ ఆంధ్ర అవార్డు' అందుకున్నారు. ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా నునపర్తిలో జరిగిన అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలో ఉమ్మడి చిత్తూరు జిల్లా తరపున ఆడి బెస్ట్ ప్లేయర్‌గా నిలిచి అవార్డు అందుకున్నాడు. వచ్చే ఏడాది జనవరిలో జాతీయ స్థాయి పోటీలో ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ఆడనున్నాడు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున ఆడి జట్టు విజయానికి కృషి చేస్తానని తెలిపాడు. తనను ప్రోత్సహించిన బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శి బాలాజీ, పీలేరు సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు అవినాష్‌రెడ్డి, రాజేష్‌లకు, సీఎస్ఆర్ డిగ్రీ కళాశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపాడు.

నూతన భవనాలు ప్రారంభం



వారపు సంతలో నూతన భవనాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె వారపు సంతలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న నూతన భవనాలను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బుధవారం సర్పంచ్ పాపులమ్మ, మల్లప్ప, నాబార్డ్ డీజీఎం ఎం.ఎస్.ఆర్.మూర్తి, డీడీఎం విజయ్‌విహారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిమ్మనపల్లె వారపు సంతలో రూ.14.98 లక్షల నాబార్డ్ నిధులు, రూ. 1.5 లక్షల గ్రామపంచాయతీ నిధులతో కార్యాలయ గది, గోడౌన్, భవనాలతో పాటు దుకాణాలకు అవసరమైన రెండు రేకుల షెడ్లు, 20 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం సర్పంచ్ పాపులమ్మ, మల్లప్ప ప్రత్యేక చొరవతో పూర్తి చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలోనూ తాగునీరు, సిమెంటు రోడ్లు, మురుగనీటి కాలువలను ఏర్పాటు నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్ రెడ్డి, ఈవోపీఆర్డి చలపతిరావు,పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, టిడిపి నాయకులు, రెడ్డప్ప రెడ్డి, మల్లికార్జున, రాజన్న పుత్ర వెంకటరమణ, లక్ష్మన్న,శ్రీపతి, చినబాబు విజయ్, జనసేన మండల ఉపాధ్యక్షులు ఈతకట్ల చంద్రశేఖర్,తదితరులు పాల్గొన్నారు.

గుండెజబ్బులపై నిర్లక్ష్యం వద్దు

- అవగాహన, అప్రమత్తత అవసరం
- డాక్టర్ మంజునాథ్‌బాబు



మాట్లాడుతున్న గుండె వైద్య నిపుణులు డాక్టర్ మంజునాథ్

మదనపల్లె : ప్రాణాంతకమైన గుండెజబ్బులపై ఎవరూ నిర్లక్ష్యంగా ఉండద్దని, అవగాహన, అప్రమత్తతతో ఉంటే వాటి బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చని నారాయణ హృదయాలయ గుండె వైద్య నిపుణులు డాక్టర్.మంజునాథ్‌బాబు తెలిపారు. బుధవారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో నారాయణ హృదయాలయ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డాక్టర్ మంజునాథ్‌బాబు, బాస్ వ్యవస్థాపకులు పీటీఎం.శివప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజునాథ్‌బాబు మాట్లాడుతూ.. ఆధునిక సమాజంలో మనిషి శారీరక శ్రమకు దూరమై, తీవ్రమైన మానసిక ఒత్తిడికి లోనవుతున్నాడని, నిద్రలేమి సమస్య అధికమైందని, దీంతో గుండెసంబంధ వ్యాధుల బారిన పడేవారి సంఖ్య విపరీతంగా పెరుగుతోందన్నారు. గుండెజబ్బులను మూడురకాలుగా గుర్తించడం జరుగుతుందని, ఒకటి జెనటికల్, రెండు ఆహారం, జీవనవిధానం వల్ల వస్తాయన్నారు. మంచి జీవనవిధానం అవలంబించడం ద్వారా గుండెజబ్బులు రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. స్మోకింగ్, ఆల్కహాల్, డ్రగ్స్ పూర్తిగా మానేయడం, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండటం, మాంసాహారాన్ని మితంగా తీసుకోవడం, నడక, వ్యాయామం తదితర శారీరకశ్రమల ద్వారా షుగర్, బీపీ కంట్రోల్ చేసుకోవచ్చన్నారు. ఇలాచేస్తే గుండెజబ్బులు చాలావరకు నియంత్రించవచ్చన్నారు. సమావేశంలో నరేష్, మనోజ్, బాస్ సాన్నికంటిరెడ్డెప్ప, బురుజురెడ్డిప్రసాద్, తలారి కృష్ణ, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దసరా బొమ్మల కొలువు



మదనపల్లె సిటీ : దసరా ఉత్సవాల్లో భాగంగా స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీలో బుధవారం ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు ఆకట్టుకుంది. కాలేజీ ఆవరణంలో వివిధ రకాల దేవుని బొమ్మలతో పాటు పలు రకాల బొమ్మలను ఏర్పాటు చేశారు. అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్, ప్రిన్సిపాల్ రమాదేవి, అధ్యాపకులు డాక్టర్ రమ్య, కవిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ఉచిత వృత్తి శిక్షణ కోర్సు

రాజంపేట : రాజంపేట ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఉచిత వృత్తి శిక్షణ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని స్కిల్ కాలేజ్ భారత్ ఎడ్యుకేషన్ సొసైటీ రాజంపేట ఇన్‌చార్జ్ సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎడ్యుకేషన్ సొసైటీ, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి కల్పన లక్ష్యంగా శిక్షణ ఇవ్వబడుతుందన్నారు.

క్షయ, లెప్రసీ నివారణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ శైలజ

మదనపల్లె: క్షేత్ర స్థాయిలో క్షయ, లెప్రసీ నివారణకు ఎంఎల్‌హెచ్‌ఓలు కృషి చేయాలని జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌ఓ శైలజ అన్నారు. బుధవారం త్యాగరాజ వీధి యూపీహెచ్‌సీలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్ ఓ డాక్టర్ రమేష్ బాబు మదనపల్లె టీబీ విభాగ అధికారి డాక్టర్ శ్రీధర్‌లతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..క్షయ, లెప్రసి రోగులకు మెరుగైన సేవలు అందిచడంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. క్షయ,లెప్రసి వ్యాధిగ్రస్థుల ఆరోగ్య పరిస్థితి పై ఎప్పటికప్పుడు వారిని అప్రమత్తం చేస్తూ, సకాలంలో మందులు తీసుకునేలా ఎం ఎల్‌హెచ్‌ఓలు బాధ్యత వహించాలన్నారు. టిబి రహిత ముక్త్ పంచాయతీలకు కృషి చేయాలన్నారు.. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ మోహిత్ రెడ్డి, జిల్లా టిబి ప్రోగ్రాం కో.ఆర్డినేటర్ చెన్నారెడ్డి , టిబి యూనిట్ సిబ్బంది ప్రభాకర్ , దయాలన్, వనజ కుమారి, సుశీల, లెప్రసి అధికారులు వేణుగోపాల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి



ముదివేడు రిజర్వాయర్ వద్ద నిరసన తెల్పుతున్న సీపీఎం నాయకులు

కురబలకోట : మండలంలోని ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి. వెంకటేశ్వర్లు డిమాండు చేశారు. బుధవారం రిజర్వాయర్‌ను సందర్శించి భూ నిర్వాసితులతో కలసి నిరసన వ్యక్తం చేశారు. కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో ఐదు గ్రామాలు పూర్తిగా మునిగిపోతాయన్నారు. 780 ఎకరాల భూములకు రూ. 108 కోట్ల నష్టపరిహారం చెల్లించాల్సి ఉన్నా అమలుకు నోచు కోవడం లేదన్నారు.2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలన్నారు.ప్రతి కుటుంబానికి ఐదు సెంట్ల ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం కోసం రూ. 25 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు కూడా మెమోరాండం ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి..నమస్తుభ్యం



మదనపల్లె : సరస్వతీదేవిగా వాసవీ అమ్మవారు



మదనపల్లె : శ్రీలలితత్రిపుర సుందరిదేవి



పీలేరు : సరస్వతీదేవిగా కన్యకాపరమేశ్వరి



వాల్మీకిపురం : సరస్వతీదేవిగా నల్లబీర గంగాభవాని



కలికిరి : సరస్వతీదేవిగా ఎల్లమ్మతల్లి



గుర్రంకొండ : సరస్వతీ అలంకారంలో రెడ్డెమ్మతల్లి



కేవీపల్లె : సరస్వతీదేవి అలంకరణలో చౌడేశ్వరిదేవి



బి.కొత్తకోట : బంగారు చీర అలంకరణలో వాసవిదేవి



వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మహిళల కోలాటం

మదనపల్లె సిటీ : దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం మదనపల్లె పట్టణంలోని అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లను చదువుల తల్లి సరస్వతీదేవిగా అలంకరించారు. చేతితో వీణ చేతపట్టుకుని సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక వాసవీభవన్‌వీధిలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని సరస్వతిదేవి అలంకారం చేశారు. పిఅండ్ టీ కాలనీ, సొసైటీ కాలనీ, వెంకటేశ్వరకాలనీ, మార్చురివీధి, బెంగుళూరురోడ్డు ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారికి సారెను ఊరేగింపు తెచ్చి సమర్పించారు. వాసవీ మహిళా సంఘం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక నీరుగట్టువారిపల్లెలోని శ్రీచౌడేశ్వరి ఆలయంలో అమ్మవారిని సరస్వతిదేవిగా దర్శనమిచ్చారు. తొగటవీరక్షత్రియ మహిళా సంఘం ఆధ్వర్యంలో మహిళలకు గాజులు, పసుపు,పసుపుతాడులను అందజేశారు. స్థానిక దేవళంవీధిలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయంలో శ్రీలలితత్రిపురసుందరిదేవి అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు.

సరస్వతిదేవిగా అమ్మవారు

పీలేరు రూరల్ : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే బుధవారం స్థానిక మోడల్ కాలనీలోని యల్లమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ, పూజలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని రౌద్రాల అంకాలమ్మ అమ్మవారికి అభిషేకం నిర్వహించి సరస్వతీదేవి అలంకరణ చేశారు.

చదువులతల్లి అలంకరణలో

వాల్మీకిపురం : నవరాత్రి దసరా ఉత్సవాలలో భాగంగా బుధవారం అమ్మవారి మూలనక్షత్రం పురస్కరించుకుని సరస్వతీదేవి అలంకరణలో శ్రీ నల్లబీరగంగాభవానీ అమ్మవారు ముస్తాబై భక్తులను కనువిందు చేశారు. స్థానిక శ్రీ వాసవీ అమ్మవారి ఆలయంలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారు, శ్రీ కామేశ్వరస్వామిదేవస్థానంలో శ్రీ లక్ష్మీకామేశ్వర అమ్మవారు, అదే వింధగా మండలంలోని చింతపర్తిలో శ్రీ వాసవీ అమ్మవారి ఆలయంలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారు సరస్వతీదేవి, గండబోయనపల్లిలో శ్రీ సత్యమ్మతల్లి ఆలయంలో సత్యమ్మతల్లి అమ్మవారు సరస్వతీదేవి, గొల్లపల్లిలో విరూపాక్షమ్మ తల్లి అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో ముస్తాబై భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

కలికిరిలో..

కలికిరి : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా కలికిరి గ్రామదేవత ఎల్లమ్మ భక్తులకు చదువుల తల్లి సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. పట్టణంలో వెలసిన సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్టించిన దుర్గామాతకు విశేష పూజలు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. రాత్రి మహిళలు లలిత సహస్రనామ కుంకుమార్చన నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో దసరా సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు.

సరస్వతీదేవిగా రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ : మండలంలోని చెర్లోపల్లెలో వెలసిన రెడ్డెమ్మతల్లి సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం గ్రామ దేవతలైన శ్రీపోలేరమ్మతల్లి, శ్రీ గంగమ్మతల్లి, శ్రీకన్యకా పరమేశ్వరీ అమ్మవార్లు శ్రీసరస్వతీదేవి అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవార్లకు పలురకాల నైవేద్యాలను సమర్పించి ఘనంగా పూజలు నిర్వహించారు.

చౌడేశ్వరిదేవికి విశేష పూజలు

కేవీపల్లె : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చీనేపలెల్లో వెలసిన శ్రీ రామలింగ చౌడేశ్వరి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి అభిషేకాలు, సరస్వతీదేవి అలంకరణ చేశారు. అమ్మవారికి దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే గర్నిమిట్ట యల్లమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు.

బంగారు చీరలో వాసవిదేవి

బి.కొత్తకోట : నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీదేవి బంగారు చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. బంగారు చీరలో అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.